లబ్ధిదారుల్లో డబుల్ సంతోషం

- మలక్‌పేట నియోజకవర్గానికి డబుల్ బెడ్‌రూంలు ఐకాన్
- పిల్లిగుడిసెల వాసులకు ఇండ్లు ఇవ్వడం వరం

సైదాబాద్, నవంబర్ 4: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చంచల్‌గూడ జైల్ సమీపంలో నూతనంగా నిర్మించిన పిల్లిగుడిసెల డబుల్ బెడ్ రూం ఇండ్లు పేద ప్రజలకు వరంలా మారాయి. 1.4 ఎకరాల విస్తీర్ణంలో ఏ, బీ, సీ బ్లాక్‌లలో రూ. 29.41కోట్ల వ్యయంతో జీ +9 అంతస్తుల్లో 288 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించగా,141 మంది లబ్ధిదారులకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి కొత్తింటి తాళాలను మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ అందజేశారు. 2015 డిసెంబర్‌లో మంత్రి కేటీఆర్ డబుల్ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినప్పటికీ 2017 పనులు ప్రారంభమై నాలుగేండ్లలో 288 ఇండ్లను సకల హంగులతో నిర్మాణాలను సకాలంలో పూర్తి చేశారు. 2021 ఆగస్టులో లబ్ధిదారులకు అందజేశారు. గృహప్రవేశం కార్యక్రమంలో స్వయంగా మంత్రి కేటీఆర్ లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించారు. మంత్రులే పలకరించి ఇండను బహుమతిగా ఇవ్వడంతో లబ్ధిదారులు సంతోషంలో మునిగిపోయారు.

ఇండ్లు ఇవ్వడంతో రూపురేఖలు మారాయి..

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇక్కడి ప్రశాంత వాతావరణం, సోదరభావంతో ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరం ప్రసిద్ధి చెందింది. సీఎం కేసీఆర్ పాతనగరం అభివృద్ధికి ప్రాధాన్యత చూపించటంతో శరవేగంగా బస్తీల రూపురేఖలు మారిపోతున్నాయి. పిల్లిగుడిసెల్లో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణంతో ఐకాన్‌గా మారింది.

సముదాయంలో సకల వసతులు

ప్రగతి భవనల్‌లో వాడుతున్న సిండ్‌లేర్ కంపెనీ మూడు లిఫ్టులు, విద్యుత్ అంతరాయం కలుగకుండా మూడు జనరేటర్లను ఏర్పాటు చేశారు. నిర్వహణ కోసం 19 దుకాణాలను ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యలు లేకుండా నల్లా కనెక్షన్లు, పవర్ బోర్లను వేసి సకల వసతులను కల్పించారు.

చంచల్‌గూడ పిల్లిగుడిసెల వద్ద నిర్మించిన డబుల్ బెడ్ ఇండ్ల నిర్మాణ సముదాయం

పైసా ఖర్చు లేకుండా ఇల్లు వచ్చింది..

"గుడిసెల్లో ఉండే తమకు పైసా ఖర్చులేకుండా డబుల్ బెడ్ రూం ఇల్లు వచ్చింది. వర్షానికి, ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమకు ఆ బాధలు ఇప్పుడు కన్పించటంలేదు. అన్ని వసతులు కల్గిన ఇంట్లో ఉండటంతో సంతోషం కలిగిస్తుంది.

- సంధ్య, లబ్ధిదారురాలు

ఇల్లు వస్తుందని అనుకోలే..

"డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వస్తుందని అనుకోలే. సిటీలో సొంతంగా ఇల్లు రావటం సంతోషంగా ఉంది. కూలీ పనిచేసుకొని జీవించే తమకు సీఎం కేసీఆర్ ఉచితంగా ఇల్లు ఇచ్చిండు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదోళ్ల కొరకు పనిచేస్తుంది. మా ఓట్లు సీఎం కేసీఆర్ సార్‌కు వేసి మరోసారి గెలిపించుకుంటాం. **- సయ్యద్ మస్తాన్, లబ్ధిదారుడు**

గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి అబ్దుల్లా బలాల, డివిజన్ అధ్యక్షుడు షఫీని సన్మానిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట, నవంబర్ 4 : ఆదరించి మళ్లీ గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మలక్‌పేట ఎంఐఎం అభ్యర్థి అబ్దుల్లా బలాల తెలిపారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి పాత మలక్‌పేట డివిజన్‌లోని అప్జల్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, కాలనీవాసులు, ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్, నవంబర్ 4 : అందుబాటులో ఉంటూ.. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసినట్లు మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి బలాల అన్నారు. ఉదయం ఆజంపురా డివిజన్‌లోని ఫర్హత్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఛావనీ డివిజన్‌లోని బాగ్-ఏ-జహారా, సా యంత్రం ఆజంపురా డివిజన్‌లోని షహీఫా మసీదు నుంచి ప్రారంభమైన పాదయాత్రను టార్జాన్ గ్రండ్, ఏ, బీ, సీ కాలనీల్లో పర్యటించారు. నాయకులు సలాం షాహీద్, షేక్ మొహియుద్దీన్ అబ్రార్, అలీం పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సైదాబాద్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ డే-2023 ఎంవీ శ్రీధర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓయూ రిజిస్ట్రార్ హాజరయ్యారు. మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎంఈఎస్) చైర్మన్ శ్రీనివాస్‌రావు వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. **- సైదాబాద్, నవంబర్ 4**

కంచన్‌బాగ్ మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మనీరత్న పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లో సీవీసీ సూచనల మేరకు వారం రోజులపాటు 'అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి' నినాదంతో విజిలెన్స్ అవెర్నెస్-2023 వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మిధాని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా హాజరయ్యారు. ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్. గౌరీ శంకర రావు, ప్రొడక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ టి. ముత్తుకుమార్, డాక్టర్ ఉపేందర్ వెన్నం పాల్గొన్నారు. **- సైదాబాద్, నవంబర్ 4**

శుభాకాంక్షలు

మలక్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి అజంఅలీ జన్మదినం సందర్భంగా శనివారం బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి వేడుకల్లో పాల్గొన్నారు. అజంఅలీకు బీఆర్ఎస్ యాకుత్‌పుర ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి, మలక్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

- సైదాబాద్, నవంబర్ 4



మలక్‌పేట నియోజవకర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆజం అలీ జన్మదినం సందర్భంగా మహిళా కమిషన్ సభ్యురాలు షహీన్ అఫ్రీజ్, నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొరడు భూమేశ్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లాయక్ అలీ, నాయకులు కారింగల మారుతి, మారేపల్లి బాబురావు పాల్గొన్నారు.

- చాదర్‌ఘాట్, నవంబర్ 4

రెండోరోజు.. రెండు నామినేషన్లు

ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న సయ్యద్ బిలాల్

సైదాబాద్, నవంబర్ 4 : నామినేషన్ల నేపథ్యంలో యాకుత్‌పుర నియోజకవర్గానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం చంపాపేటలోని యాకుత్‌పుర ఆర్వో కార్యాలయానికి ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మహ్మద్ అక్రం అలీఖాన్, ఎ. సరిత నామినేషన్ల పత్రాలను ఆర్వో ఈ. వెంకటాచారికి అందజేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు 8,9 తేదీల్లో నామినేషన్లు వేయటానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. యాకుత్‌పుర ఎస్ఆర్టీ కాలనీకి చెందిన ఒకే వ్యక్తి మహ్మద్ అక్రం అలీ ఖాన్ మలక్‌పేట, యాకుత్‌పుర రెండు నియోజకవర్గాల్లో రెండు చోట్ల తమ నామినేషన్ దాఖలు చేశారు.

రెండోరోజు మలక్‌పేటలోనూ..

మలక్‌పేట, నవంబర్ 4 : రెండోరోజు నల్లగొండ చౌరస్తాలోని సర్కిల్-6 డీసీ కార్యాలయం వద్ద మలక్‌పేట నియోజకవర్గ నామినేషన్ కేంద్రం-58లో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్‌కు చెందిన అలుగోల రమేశ్ బీఎస్పీ అభ్యర్థిగా , పాత మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్‌కు చెందిన సయ్యద్ బిలాల్ ఇండిపెండెంట్‌గా దాఖలు చేశారు. ఐదుగురు ఇండిపెండెంట్లు నామినేషన్లు వేయాల్సి ఉండగా, ఇండిపెండెంట్, బీఎస్పీ అభ్యర్థి నామినేషన్లు వేశారని ఆర్ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది మంది పత్రాలు తీసుకెళ్లారని, శనివారం వరకు మొత్తం 37 మంది పత్రాలు తీసుకెళ్లినట్లు ఏఆర్ఓ, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, ఈఆర్ఓ, ఏఆర్ఓ, డీసీ జయంత్ తెలిపారు. నామినేషన్ కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ గీతా రాధిక సందర్శించారు.

పాన్ షాపులపై మూకుమ్మడి దాడులు

మలక్‌పేట, నవంబర్ 4 : మలక్‌పేట పీఎస్ పరిధిలోని షాపులపై శనివారం పోలీసులు మూకుమ్మడి దాడులు చేశారు. నిషేధిత విదేశీ సిగరెట్లు, పదార్థాలను సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 19 పాన్ షాపులపై దాడులు నిర్వహించి, రూ.10వేల విలువైన విదేశీ సిగరెట్లు స్ట్రా బెర్రీ మౌండ్-3 బాక్స్‌లు, స్పెషల్ గోల్డ్-5బాక్సులు , ఈఎస్ఎస్‌సీ-5 బాక్సులు, డీజేఆరం-4 బాక్సులు, రాజా టోబాకో, అంబర్లు, షైనీ లడీలను స్వాధీనం చేసుకున్నారు. 19 మంది నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.